సాక్షి అనకాపల్లి

గురువారం ၊ 26 ၊ అక్టోబర్ ၊ 2023



అయ్యప్ప దీక్షా పీఠం

విశాఖ: శంకరమఠంలో అయ్యప్ప దీక్షా పీఠం ప్రారంభించారు. లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు.



ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్నపస్నాలతో జలాభిషేకం చేశారు.



విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి అర్చక స్వాములు బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిపించారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర గవర్నర్ రాక రేపు



మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 27న విశాఖ వస్తున్నారు. గన్నవరం నుంచి విమానంలో సాయంత్రం 4.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా నొవోటెల్ హోటల్ చేరుకొని అక్కడే బస చేస్తారు. 28న ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కి స్వాగతం పలుకుతారు. ఉపరాష్ట్రపతితో నేరుగా ఆంధ్ర మెడికల్ కాలేజీకి 11.30 గంటలకు చేరుకొని మధ్యాహ్నం 1.05 గంట వరకు అక్కడే ఉంటారు. అనంతరం గవర్నర్ నొవోటెల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3.55 గంటలకు విశాఖ విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. 4.35 గంటలకు గన్నవరం బయలుదేరుతారు.

జెడ్పీ సీఈవోగా పోలినాయుడు



మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా ఎం.పోలినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలినాయుడు గతంలో వి.మాడుగుల మండలం ఎంపీడీవోగా పని చేశారు. కొద్ది నెలల క్రితం డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో)గా పదోన్నతి లభించింది. ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు వద్ద ఓఎస్‌డీగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సీఈవోగా చేసిన పి.శ్రీరామ్మూర్తిని మాతృశాఖ అయిన సహకార శాఖకు బదిలీ చేశారు.

ధీరజ్‌కు ఆర్డీవో అభినందన




బాలగాయకుడు ధీరజ్‌ను అభినందిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: బాల గాయకుడు డి.ధీరజ్‌ను నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం అభినందించారు. నర్సీపట్నంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ధీరజ్ తన గాన మాధుర్యంతో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఇటీవల మలేషియాలో ప్రదర్శన ఇచ్చి, అక్కడి విశిష్ట కళా పురస్కారం అందుకున్నాడు. మలేషియా భాషలో పాటలు పాడి వారిని అలరించాడు. ధీరజ్ ప్రతిభ గురించి తెలుసుకున్న ఆర్డీవో తన కార్యాలయానికి పిలిపించుకొని అభినందించారు. చక్కని సాధనతో గాయకుడిగా ఎదుగుతున్న ఈ బాలుడికి మంచి భవిష్యత్తు ఉందంటూ ప్రోత్సహించారు. ఆర్డీవోను కలిసిన వారిలో ధీరజ్ తండ్రి రాజేష్, వాకర్స్ క్లబ్ సభ్యుడు సత్యనారాయణ ఉన్నారు.

నేటి నుంచి ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

తుమ్మపాల: జిల్లాలో ఖరీఫ్-2023 సీజన్ 2,50,044 ఎకరాలలో పంటల సాగు మేరకు ఈ-క్రాప్ పూర్తిచేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు బుధవారం తెలిపారు. ఈ-క్రాప్ జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు గ్రామ సభల ద్వారా సామాజిక తనిఖీ కొరకు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. రైతులు తమ వివరాలను చూసుకుని, అభ్యంతరాలు, సవరణలు ఉన్నట్లయితే తమ సిబ్బంది దృష్టికి లిఖితపూర్వకంగా తీసుకురావాలన్నారు. ఈ సీజన్‌కు ఇదే చివరి అవకాశమని, రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

28న మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు



సింహాచలం : చంద్రగ్రహణం కారణంగా శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనాలు ఈనెల 28న మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. తిరిగి 29న ఉదయం 8 నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 28న అర్ధరాత్రి దాటాక 1.07 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై 2.36 గంటల వరకు ఉంటుందన్నారు. గ్రహణం కారణంగా 28న రాత్రి ఆరాధన, 29న ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వర్ణపుష్పార్చన, గరుడసేవలు రద్దు చేసినట్లు తెలిపారు.

అభ్యసన సామర్థ్యం ఎంత?

సర్వే కోసం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలు **1,000**

పరీక్ష రాసే మొత్తం విద్యార్థుల సంఖ్య **26,151**

పరీక్షలు నిర్వహించే ఇన్విజిలేటర్లు **1101**

- 3, 6, 9 తరగతుల విద్యార్థుల అవగాహనపై సర్వే
- నవంబర్ 3న దేశమంతటా పరీక్షలు
- జిల్లాలో నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధం



జెడ్పీ హైస్కూల్లో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



పాఠం వింటున్న విద్యార్థులు

అనకాపల్లి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. నాణ్యమైన విద్య అందిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. నిపుణులతో పాఠ్యపుస్తకాలు రూపొందించి అమలు చేస్తున్నాయి. ఉపాధ్యాయుల బోధనను ఏ మేరకు పిల్లలు అర్థం చేసుకుంటున్నారు.. ఏ సబ్జెక్టులో ఎంత మేరకు ఫలితాలు వస్తున్నాయి.. చదవడం, రాయడం తదితర అంశాల్లో వారి సామర్థ్యం ఎంత.. తదితర విషయాలను గుర్తించేందుకు జాతీయ స్థాయిలో సర్వే జరగబోతోంది. కేంద్ర ప్రభుత్వం నేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్) పేరుతో నవంబరు 3న ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనుంది. ప్రతి మూడేళ్లకోసారి ఈ సర్వే నిర్వహిస్తారు. చివరిగా 2021లో జరిగింది. తాజాగా 2024లో సర్వే చేపట్టేందుకు విద్యాశాఖ సన్నద్ధం అవుతోంది. అందుకు ఇప్పటి నుంచే అధ్యయనం ప్రారంభిస్తున్నారు. అందులో భాగంగా దేశ వ్యాప్తంగా వచ్చే నెల 3న ఈ పరీక్ష జరుగుతోంది. దీని ఆధారంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని అంచనా వేసి, విద్యా ప్రణాళికలు అమలు చేస్తారు. దీనికంటే ముందు స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్)ను మండల స్థాయిలో నిర్వహిస్తారు.

జిల్లావ్యాప్తంగా 26,151 మంది విద్యార్థులు

దేశవ్యాప్తంగా నవంబరు 3న జరిగే పరీక్షకు అనకాపల్లి జిల్లా నుంచి ఎంపిక చేసిన 1000 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 26,151 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 3వ తరగతి విద్యార్థులు 8848 మంది, 6వ తరగతి విద్యార్థులు 8721 మంది, 9వ తరగతి విద్యార్థులు 8582 మంది ఉన్నారు. మండలాల వారీగా పాఠశాలల ఎంపిక, హాజరు కానున్న విద్యార్థుల సంఖ్య వివరాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. గతంలో మాదిరిగానే ఓఎంఆర్ విధానంలోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతికి సంబంధించిన సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. 3, 6 తరగతుల విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై పరీక్ష ఉంటుంది. 3, 6 తరగతుల వారికి 40 ప్రశ్నలకు 60 నిమిషాల సమయం, 9వ తరగతి విద్యార్థులకు 60 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రతి శనివారం ప్రత్యేకంగా ఈ పరీక్షకు సంబంధించి ఎస్‌సీఈఆర్‌టీ రూపొందించిన ప్రాక్టీసు పరీక్షలను నిర్వహిస్తూ.. ఎలా రాయాలో ఉపాధ్యాయులు తర్ఫీదునిస్తున్నారు.

రాష్ట్రంలో విద్యా విప్లవం

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోంది. పాఠశాలల రూపురేఖలను నాడు-నేడు ద్వారా పూర్తిగా మార్చివేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తి పెరిగేలా పాఠశాలల వాతావరణంలో మార్పులు తెచ్చింది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించేలా ఉపాధ్యాయులకు పలు దఫాలు శిక్షణ అందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేస్తూ ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలను అందుబాటులోకి తెచ్చింది. దృశ్య, శ్రవణ బోధనతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపుదలకు మార్గం సుగమం అయింది. అంతే కాకుండా గుణాత్మక విద్యా కార్యక్రమాలను అమలు చేస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన, అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు ప్రభుత్వం, విద్యాశాఖ సమష్టిగా అడుగులు వేశాయి. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి, రానున్న రోజుల్లో విద్యావ్యవస్థ, బోధనా పద్ధతుల్లో తీసుకోవాల్సిన మార్పులకు అసెస్‌మెంట్ పరీక్ష ఒక చక్కటి వేదిక కానుంది.

పకడ్బందీగా నిర్వహణకు చర్యలు



జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. ఇన్విజిలేటర్లుగా ఉపాధ్యాయులే ఉంటే సమర్థంగా పరీక్ష సాగదనే ఉద్దేశంతో డైట్, డిగ్రీ, పీజీ విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించడానికి 1101 మందిని ఎంపిక చేశాం. పరీక్షను పర్యవేక్షించేందుకు బ్లాక్ కోఆర్డినేటర్లుగా ఎంఈవోలకు బాధ్యతలు అప్పగించాం. పరీక్ష నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే వారందరికీ శిక్షణనిచ్చాం.

– ఎం.వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ఓటర్ల జాబితా ముసాయిదా సిద్ధం

- రేపు డ్రాఫ్ట్ రోల్స్ ప్రచురణ
- డిసెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి తనిఖీ పూర్తి
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఓటర్ల జాబితా ముసాయిదా సిద్ధం చేసినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27న ఓటర్ల జాబితా ముసాయిదా (డ్రాఫ్ట్ రోల్స్) ప్రచురణ జరుగుతుందని, ఆ రోజు నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరిస్తారని చెప్పారు. నవంబర్ 4, 5 తేదీలు, డిసెంబర్ 2, 3 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తారన్నారు. అభ్యంతరాల స్వీకరణ తర్వాత జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. గత 9 రోజులుగా రాజకీయ నేతల పర్యవేక్షణలో జరుగుతున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రథమ స్థాయి (ఫస్ట్ లెవెల్) చెకింగ్‌లో 1500 బ్యాలెట్ యూనిట్-బీయూ, కంట్రోల్ యూనిట్-సీయూ, వీవీపీఏటీ తనిఖీ పూర్తయిందన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.సంతోష్ (కాంగ్రెస్), సీహెచ్.నాగేశ్వరరావు (బీజేపీ), బి.శ్రీనివాసరావు(టీడీపీ), కె.హరినాథబాబు (ఆమ్ ఆద్మీ), డీఆర్వో బి.దయానిధి, ఎన్నికల పర్యవేక్షకులు లక్ష్మీదేవి, టి.డి.రవికుమార్, ఎస్.ఎ.తులసీరాం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్



దిబ్బపాలెంలో ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న ఆర్టీవో హేమసుందర్

అనకాపల్లి రూరల్: ప్రస్తుతం మార్కెట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి గిరాకీ ఉందని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) రీజనల్ టెక్నికల్ అధికారి (ఆర్టీవో) హేమసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగులో ఉన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. సంబంధిత రైతులు వి.లక్ష్మీపూర్ణ, ఎం.వరలక్ష్మిలతో మాట్లాడుతూ సాగు చేస్తున్న పంటలు, సాగుకయ్యే వ్యయం, వచ్చే ఆదాయం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రోత్సాహాన్ని ఇస్తోందన్నారు. జీరో బడ్జెట్ వ్యవసాయ సాగుపై రైతులందరూ దృష్టి సారించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రకృతి సాగు చేపడుతున్న రైతులు ఆయనతో మాట్లాడుతూ తమ సొంత అవసరాలకు మినహా, మిగిలిన వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తే మంచి ఆదాయం వస్తోందన్నారు. ప్రకృతి సాగులో మరింత దిగుబడి, ఆదాయం కోసం అవలంభించాల్సిన పలు సాంకేతిక మెలకువలను ఆయన రైతులకు వివరించారు. జీవామృతం తయారీ విధానంపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మెంటార్ జానకి, మోడల్ మేకర్ వి.శ్రీనివాసరావు, ఐసీఆర్‌పీ స్వాతి పాల్గొన్నారు.

రేపు స్థాయీ సంఘ సమావేశం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 27న నిర్వహించనున్నారు. మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి జరిగే సమావేశంలో 52 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు రానున్నాయి. వినాయక చవితి పురస్కరించుకుని జోన్-3 పరిధి పెద్ద జాలారిపేట, ఆర్టీసీ డిపో వెనుక బీచ్‌లో 10 రోజుల పాటు షిఫ్టుల రూపంలో నిమజ్జన సేవలు అందించిన ఒక్కొక్కరికీ రూ.500 చొప్పున రోజుకు 50 మందికి రూ.25 వేలు చెల్లించే అంశం, జోన్-8 పరిధి 89 నుంచి 98 వార్డుల్లో రాత్రివేళ పారిశుధ్య పనులు మూడు నెలల పాటు నిర్వహించేందుకు అదనపు సిబ్బంది నియామకం, 29వ వార్డు వెంకటేశ్వరనగర్‌లో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం స్థానంలో రూ.49.95 లక్షలతో జీ+1 తరహాలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, 29వ వార్డు శ్రీరంగపురంలో శిథిలావస్థలోని కమ్యూనిటీ హాల్‌ను కూల్చి, ఆ స్థానంలో జీ+1 తరహాలో కమ్యూనిటీ హాల్‌ను రూ.49.90 లక్షలతో నిర్మాణం చేపట్టడం, 90వ వార్డు వినోద్‌నగర్ సచివాలయ పరిధిలో శిథిలావస్థలోని కమ్యూనిటీ హాల్‌ను తొలగించి, మొదటి అంతస్తు నిర్మాణం, 95వ వార్డు పురుషోత్తపురం మరిడిమాంబ ఆలయం వద్ద సీసీ కాలువ నిర్మాణం, పలు వార్డుల్లో సీసీ రోడ్ల పునరుద్ధరణ, జీవీఎంసీ ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్ అంశాలు చర్చకు రానున్నాయి.

రూ.100 కోట్లతో క్లినికల్ అండ్ బయో మెడికల్ సెంటర్

- ఉప రాష్ట్రపతి చేతులమీదుగా శంకుస్థాపనకు సన్నాహాలు

మహారాణిపేట: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పర్యటన ఖరారు కావడంతో.. ఆయన చేతుల మీదుగా పలు కార్యక్రమాలు చేపట్టడానికి ఆంధ్రా మెడికల్ కాలేజీ సన్నాహాలు చేస్తోంది. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సెంటినరీ పైలాన్‌ను ఉప రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. అమెరికాలో స్థిరపడ్డ వైద్యులు, వైద్య విద్యార్థుల సహకారంతో రూ.20 కోట్ల వ్యయంతో క్లినికల్ అండ్ బయో మెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు అమెరికాలో స్థిరపడ్డ వైద్యులు తొలి విడతగా రూ.20 కోట్లు అందించినట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఈ నిధులతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, త్వరలో పనులు మొదలు పెడతామన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనకాపల్లి టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. 'లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ-సామాజిక పాత్ర' అనే అంశంపై వివిధ పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌హెచ్‌వోలు పాఠశాలలను సందర్శించి సమ సమాజ నిర్మాణంలో, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, మహిళలు, పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, అమలు పరుస్తున్న చట్టాలపై విద్యార్థులకు వివరించినట్లు చెప్పారు.

మెట్రో ముందడుగు

విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు మరో ముందడుగు. వచ్చే ఏడాది సంక్రాంతికి పునాది రాయి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సమగ్ర సర్వే నిర్వహించి.. రద్దీతో పాటు స్థలానికి అనుగుణంగా మెట్రో స్టేషన్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి.. ఎన్ని కిలోమీటర్ల పరిధిలో స్టేషన్ రావాలి.. వంటి అంశాలతో కూడిన డీపీఆర్‌ని సిద్ధం చేసింది. తొలి విడతగా కారిడార్-1ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. ఈ కారిడార్‌లో స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34.40 కి.మీ ట్రాక్ వెంబడి 29 స్టేషన్లు రానున్నాయి.



- తొలివిడతలో కారిడార్-1 పనుల ప్రారంభానికి సన్నాహాలు
- స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 29 స్టేషన్లతో 34.40 కి.మీ మేర ఏర్పాటు
- మద్దిలపాలెం డిపోని అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ స్టేషన్
- కొన్ని ప్రాంతాల్లో కి.మీ లోపే మెట్రో స్టేషన్ ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం : పరిపాలన రాజధాని విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం ప్రజలకు రవాణా సౌకర్యాలు భవిష్యత్తులో మెరుగుపరిచేందుకు మెట్రోపై దృష్టి సారించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ నుంచి పరిపాలన సాగించేందుకు అడుగులు పడుతున్న తరుణంలో.. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. అందుకే రెండు ఫేజ్‌ల్లో 76.9 కి.మీ మేర నాలుగు లైట్ మెట్రో కారిడార్లలో 54 మెట్రో స్టేషన్లు, రెండు డిపోలు ఏర్పాటు చేయనున్నారు. **కారిడార్-1లో స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కి.మీ లైట్ మెట్రో ట్రాక్ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో మొత్తం 29 స్టేషన్లు రానున్నాయి.** ఇది వీలైనంత త్వరగా పూర్తి చేసి ట్రైన్లు నడిపించి ప్రజల్లో నమ్మకం కలిగించాలని భావిస్తున్నారు.

కారిడార్-1లో 29 స్టేషన్లు

స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ మొదటి కారిడార్‌గా, గురుద్వార్ నుంచి పాత పోస్టాఫీస్ వరకూ కారిడార్-2, తాటిచెట్లపాలెం నుంచి ఆర్కే బీచ్ వరకూ కారిడార్-3, కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ కారిడార్-4గా విభజించారు. తొలి కారిడార్ 34.40 కి.మీ మేర ఉన్న నేపథ్యంలో మొత్తం 29 స్టేషన్లు రానున్నాయి. తొలి మెట్రో స్టేషన్ కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే రానుంది. చాలా ప్రాంతాల్లో కిలోమీటర్ కంటే తక్కువ దూరంలోనే స్టేషన్ ఏర్పాటు కానుంది. ఆదేవిధంగా.. మద్దిలపాలెం డిపోని మెట్రో రైల్ స్టేషన్‌ని అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ స్టేషన్ ఏర్పాటు కానుంది.

కారిడార్-1	స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు..	34.40 కి.మీ, 29 స్టేషన్లు
కారిడార్-2	గురుద్వార్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు..	5.08 కి.మీ, 6 స్టేషన్లు
కారిడార్-3	తాటిచెట్లపాలెం నుంచి ఆర్కే బీచ్ వరకు..	6.75 కి.మీ, 7 స్టేషన్లు
కారిడార్-4	కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు..	30.67 కి.మీ, 12 స్టేషన్లు

లైట్ మెట్రో ప్రాజెక్టు స్వరూపం ఇలా..

ప్రాజెక్టు విస్తీర్ణం: **76.90** కి.మీ, **54** స్టేషన్లు

మొత్తం అంచనా వ్యయం: రూ.**14,309** కోట్లు

ఫేజ్-1లో కారిడార్-1, 2, 3 నిర్మాణానికి రూ.**9,699** కోట్ల అంచనా వ్యయం

ఫేజ్-2లో కారిడార్-4 నిర్మాణానికి రూ.**4,610** కోట్ల అంచనా వ్యయం

నయా సైబర్ మోసం

- విద్యుత్ బిల్లు కట్టలేదని వ్యక్తికి మెసేజ్
- నిజమని నమ్మడంతో రూ.3లక్షలు టోకరా
- సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- దర్యాప్తు చేసి డబ్బులు తిరిగి ఇప్పించిన పోలీసులు

దొండపర్తి: నగరంలో ఓ వ్యక్తికి విద్యుత్ బిల్ అప్డేట్ కాలేని, కనెక్షన్ కట్ అవుతుందని.. ఈ నంబర్‌కు కాల్ చేయండి అంటూ ఓ మెసేజ్ వచ్చింది. అది నిజమని నమ్మిన ఆ వ్యక్తి ఫోన్ చేసి వారు చెప్పిన విధంగా చేయడంతో అతని బ్యాంక్ అకౌంట్‌లోని రూ.3లక్షలు డెబిట్ అయ్యాయి. దీంతో మోసపోయానని గ్రహించిన ఆ వ్యక్తి వెంటనే సైబర్ క్రైం పోలీసులు ఫిర్యాదు చేశాడు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు డీసీపీ-1 కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. బాధితుడి బ్యాంక్ స్టేటమెంట్ ద్వారా డబ్బులు ఎక్కడకు వెళ్లాయో తెలుసుకుని వారికి మెయిల్ ద్వారా మెసేజ్ చేయడంతో పాటు సదరు సంస్థ నోడల్ అధికారితో మాట్లాడి నగదును హోల్డ్ చేశారు. తర్వాత ఆ డబ్బు క్రోమా రిటైలర్‌కు వెళ్లినట్లు గుర్తించి వారిని సంప్రదించగా, ఆ సంస్థ లావాదేవీని పరిశీలించి అది ఫ్రాడ్‌గా గుర్తించింది. దీంతో ఆ నగదును మళ్లీ బాధితుడి ఖాతాకు బదిలీ చేసింది. విద్యుత్ కనెక్షన్ రద్దు అవుతుందని, బిల్లు అప్డేట్ కాలేదని మెసేజ్ వస్తే నమ్మవద్దని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ ప్రజలకు సూచించారు.

విహార యాత్రలో విషాదం

స్నేహితుల విహార యాత్ర ఓ కుటుంబంలో విషాదం నింపింది. సరదాగా రైవాడ జలాశయాన్ని చూసొద్దామని వీరు వెళ్లగా, అక్కడ బోటు బోల్తా పడి ఒకరు గల్లంతు కాగా, ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషాద ఘటన దేవరాపల్లిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది.


రొంగలి సత్తిబాబు(ఫైల్)

- రైవాడ జలాశయంలో కలాసీ గల్లంతు
- బోటు బోల్తా పడటంతో ప్రమాదం
- సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో బోటు బోల్తా పడిన ఘటనలో కలాసీ గల్లంతయ్యాడు. సబ్బవరం మండలం బలుసుపాలేనికి చెందిన రొంగలి సత్తిబాబు (38) తన ఆరుగురు స్నేహితులతో కలిసి జలాశయానికి విహారయాత్రకు వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యాడు. సబ్బవరంలో కలాసీగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న సత్తిబాబు తోపాటు గండిబోయిన సూకరాజు, చల్లా రాము, శానాపతి అప్పలనాయుడు, గొంప శ్రీను, లెక్కల గంగునాయుడు దసరా వేడుకను పురస్కరించుకుని జలాశయం సందర్శనకు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. అక్కడ పరిసరాల్లో సరదాగా గడిపిన వీరంతా మధ్యాహ్నం అక్కడే కలిసి భోజనం చేశారు. అప్పటి వరకు అందరితో సరదాగా గడిపిన సత్తిబాబు ఒడ్డున నిలిపి ఉన్న బోటు (చేపల బోటు) ఎక్కి జలాశయంలోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో ఒక్కసారిగా బోటు బోల్తా పడటంతో అందులో మునిగిపోయాడు. అందరూ చూస్తుండగానే మునిగిపోవడంతో మిగిలిన వారంతా చేసిన ప్రయత్నాలన్నీ ఫలించలేదు. తమతోపాటు వచ్చి జలాశయంలో మునిగిపోయిన సహచర కలాసీ ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో అదేరోజు సాయంత్రం దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలకు దిగినట్టు ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపారు.

సబ్బవరం మండలం బలుసుపాలెంలో విషాద ఛాయలు

గల్లంతైన సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భవానీ మాలధారణ దీక్ష పూర్తి చేసుకున్న కుమారుడిని తన భార్యతో కలిసి బుధవారం ఉదయం విజయవాడ దుర్గాదేవి దర్శనానికి సాగనంపాడు. అనంతరం సహచర కలాసీలతో కలిసి జలాశయం వద్ద సరదాగా గడిపేందుకు వచ్చిన సత్తిబాబు గల్లంతవ్వడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఒకటే ఆశయం.. ఒకటే ఆహార్యం

- జగనన్న ఆరోగ్య సురక్షలో మహిళా వలంటీర్ల విశేష సేవలు
- సర్వత్రా ప్రశంసలు

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట సచివాలయంలో బుధవారం మహిళా గ్రామ వలంటీర్లు తమ ప్రత్యేకతను చాటారు. ఇక్కడ నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలు తమను సునాయాసంగా గుర్తించేందుకు ప్రత్యేక యూనిఫారం ధరించారు. ప్రజలకు సేవలందించారు. అమీన్‌సాహెబ్‌పేటలో ఉన్న ఏడుగురు మహిళా వలంటీర్లు సొంత ఖర్చుతో ఒకే విధమైన చీరలు కొనుగోలు చేశారు. ఒక్కొక్కరు అందుకు రూ.500 వెచ్చించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతోపాటు ప్రత్యేక సందర్భాల్లో అంతా కలిసి స్వతహాగా రూపొందించుకున్న యూనిఫారం ధరించి ప్రజలకు సేవలందిస్తున్నట్లు గ్రామ వలంటీర్ గంటా కుమారి, ముత్యాల శిరీష, దంట్ల ప్రభ తెలిపారు. ప్రజలు తమను సులువుగా గుర్తించి, సేవలు అందుకునేందుకు వీలుగా ప్రత్యేక సందర్భాల్లో ఈ వస్త్రధారణ చేస్తున్నట్లు చెప్పారు. వీరితోపాటు జనపురెడ్డి దుర్గాభవాని, నలమారి స్వాతి, జవ్వాదుల వాహిని, మోటూరి లలిత ఉన్నారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేరుస్తూ.. గ్రామ వలంటీర్లు అంకిత భావంతో పనిచేస్తున్నారనడానికి ఇది నిదర్శనంగా నిలుస్తుందంటున్నారు.


మహిళా వలంటీర్లను అభినందిస్తున్న పంచాయతీ కార్యదర్శి సత్యారావు


కశింకోట మండలం అమీన్‌సాహెబ్‌పేటలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు


దేవరాపల్లి మండలం ఏ కొత్తపల్లిలో వైద్య శిబిరానికి దివ్యాంగుడిని వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న కుటుంబ సభ్యులు

అభివృద్ధి పనులపై ఎంపీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ పబ్లిక్‌హెల్త్ అధికారులను ఎంపీ బీవీ సత్యవతి ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె పబ్లిక్‌హెల్త్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ పరిధిలో పలు అభివృద్ధి పనులకు రూ.1.45 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. వాటి ప్రగతిని ఆరా తీశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ అభివృద్ధి పనుల ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వివరించారు. శాంతిపార్కు, బీసీ, ఎస్సీ వసతిగృహాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ సూచించారు.

9 టేకు దుంగలు పట్టివేత

- వీటి విలువ రూ.3 లక్షలు

గొలుగొండ: ట్రాక్టర్‌పై అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది టేకు దుంగలను గొలుగొండ సెక్షన్ అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టుకున్నారు. కొత్తపాలెం నుంచి వీటిని ట్రాక్టర్‌పై తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నామన్నారు. మొత్తం టేకు దుంగల విలువ రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ నివేదిక నర్సీపట్నం డీఎఫ్‌వోకి అందజేశామన్నారు. పట్టుకున్న కలపతోపాటు ట్రాక్టర్‌ను గొలుగొండ కలప డిపోకు తరలించామన్నారు. కార్యక్రమంలో గొలుగొండ అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుకున్న టేకు కలపతో ట్రాక్టర్

కారు ఆటో ఢీ.. ముగ్గురికి గాయాలు

ఎటపాక: ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. భద్రాచలం నుంచి 12 మంది ప్రయాణికులతో ఉన్న ఆటో గన్నవరం వేపు వస్తోంది. అదే సమయంలో ఓ కారు కూనవరం నుంచి భద్రాచలం వెళ్తోంది. నెల్లిపాక హైవే బైపాస్ జంక్షన్ వద్ద ఈ రెండూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో పల్టీ కొట్టగా, ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిలో గౌరీపేటకు చెందిన యన్నం అచ్చమ్మ, కరి మంగమ్మ, పత్తి సుశీలకు కాళ్లు, చేతులు విరిగాయి. అచ్చమ్మను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు.


కారు, ఆటో ప్రమాద ఘటన

బాల్ బ్యాడ్మింటన్ అంతర్రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్ల ప్రతిభ



జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్లను అభినందిస్తున్న క్రీడా శాఖ మంత్రి రోజా

అచ్యుతాపురం(అనకాపల్లి): ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. చిత్తూరు జిల్లా నగరిలో ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ 8వ అంతరాష్ట్ర స్థాయి జూనియర్ అండర్ -19 బాల బాలికల పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానాలు సాధించారు. ఈ మేరకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్.కె రోజా నుంచి జ్ఞాపికలు అందుకున్నారు. జిల్లా జట్లను బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్.వెంకటరావు, అధ్యక్షుడు ప్రభూజీ, ప్రధాన కార్యదర్శి గొంప నర్సింహనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శంకర్‌రావు, బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ ఛైర్మన్ నగేశ్ అభినందించారు.

ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టిన కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

సబ్బవరం: సబ్బవరం-చోడవరం రోడ్డులోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మాడుగుల మండలం అవురువాడ పంచాయతీ సీతబందలు గ్రామానికి చెందిన ఎస్.చంటి, ఎస్.కృష్ణ ఒక ద్విచక్రవాహనంపై, ఎం.రాజు, కె.రాజు మరో ద్విచక్రవాహనంపై అదే రోజు సాయంత్రం సింహాచలంలోని బంధువుల పెళ్లికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో లగిశెట్టిపాలెం వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు బలంగా రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొట్టింది. దీంతో వెనుక, ముందు వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు చెల్లాచెదురుగా తూలిపోయాయి. కారు రోడ్డు పక్కన ఉన్న పిక్క కుప్పపైకి వెళ్లి నిలిచిపోయింది. దీంతో ఒక ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న ఎస్. కృష్ణకు, రెండో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎం.రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సబ్బవరం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయని బాధితుల బంధువు కొండబాబు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనాలను ఢీకొన్న కారు

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

- ఇన్‌చార్జి డీపీవో ఎస్ఎస్ఎన్ మూర్తి

అనకాపల్లి రూరల్: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం లోపిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ డీపీవో ఎస్ఎస్ఎన్ మూర్తి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం అనకాపల్లి మండలం తుమ్మపాల మేజర్ పంచాయతీలోని పలు వీధులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా చేపట్టిన తనిఖీల్లో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాలను తక్షణమే తొలగించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఆయనే దగ్గరుండి పర్యవేక్షించారు. ఇకపై నిత్యం పారిశుధ్యాన్ని మెరుగుపర్చడానికి ప్రాధాన్యతనివ్వాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయాలని సచివాలయ, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, పంచాయతీ కార్యనిర్వహణాధికారి కె.శ్రీనివాస్, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, తుమ్మపాల-3 సచివాలయం కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.


తుమ్మపాలలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఇన్‌చార్జి డీపీవో మూర్తి

యుద్ధప్రాతిపదికన ప్రాధాన్యతా భవనాల నిర్మాణం

- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రాధాన్యతా భవనాలైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. సమస్యలేమైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండలాలవారీగా భవన నిర్మాణాల జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారాలను సూచించారు. భవన నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్, జగనన్న హౌసింగ్ కాలనీల్లో పనుల పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతికి సంబంధించిన సమాచారాన్ని ప్రతి రోజూ తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రైతులకు ఎల్లవేళలా వ్యవసాయ సేవలు

- శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

చోడవరం రూరల్: వ్యవసాయ సిబ్బంది రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి, వారికి తగు సూచనలు, సలహాలు అందించి వారి మన్ననలు అందుకోవాలని అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి బి.వి.మోహన్‌రావు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో చోడవరం డివిజన్ వ్యవసాయ సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మండల, గ్రామ స్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఖరీఫ్ సీజన్ నడుస్తున్నందున రైతులకు వ్యవసాయ సిబ్బంది అవసరం ఎక్కువగా ఉంటుందని, పంటలను ఆశించే చీడ, పీడలకు సంబంధించి వారిని అప్రమత్తం చేయాలన్నారు. ఈ - క్రాప్, పంటకోత ప్రయోగాలు, వివిధ ప్రభుత్వ పథకాలు, సీజనల్ రిపోర్టులు తయారీ, పంటల్ని పలు రకాల వ్యాధులను గురించి శిక్షణనిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చోడవరం ఏడీఏ పి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కలుగుతున్న లబ్ధిని మరింత విస్తృతం చేయాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు ఇ.పావని(చోడవరం), బి.భాస్కరరావు(బుచ్చెయ్యపేట), ఎ.కృష్ణవేణి(చీడికాడ), సోమశేఖర్(కె.కోటపాడు), ఎల్.ఎర్నికాంతం (దేవరాపల్లి), ఐదు మండలాలకు చెందిన వ్యవసాయ విస్తరణాధికారులు, వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.


వ్యవసాయ సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

యువతిపై లైంగికదాడికి యత్నం

కోటవురట్ల: ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించినట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మండలంలోని కె.వెంకటాపురానికి చెందిన ఓ యువతి తల్లిదండ్రులు భవానీ మాలధారణతో ఈ నెల 23న విజయవాడ దుర్గమ్మ కొండకు వెళ్లారు. 24న యువతి చెల్లెలు నర్సీపట్నం వెళ్లగా, బాధిత యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. ఇదే అదనుగా భావించి అదే గ్రామానికి చెందిన తమరాన రామ సత్యనారాయణ సాయంత్రం 5 గంటల సమయంలో అత్యాచారానికి యత్నించాడు. దాంతో ఆమె గట్టిగా కేకలు వేసి తప్పించుకుని బయటకు పరుగు తీసింది. తల్లిదండ్రులు విజయవాడ నుంచి వచ్చాక విషయం చెప్పడంతో బుధవారం బాధిత యువతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించండి

- ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

ఎస్.రాయవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌ఐ ప్రసాదరావును ఆదేశించారు. ఎప్పటికప్పుడే కేసులను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. అంతకు ముందు పలు రికార్డులను పరిశీలించారు.


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాణా

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఎంఏఎస్ మెరైన్ సర్వీస్, ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రి, ముత్తూట్ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 295 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పోర్ట్ సర్వేయర్స్, అసోసియేట్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ నర్స్, కెమిస్ట్, ట్రైనీ కెమిస్ట్, జూనియర్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫార్మాసిస్ట్ తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18-45 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.13,000 నుంచి రూ.27,000ల వరకు ఉంటుందన్నారు.

నేడు సివిల్ సప్లయిస్ కమిషనర్ రాక

మహారాణిపేట: రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ గురువారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో గురువారం సాయంత్రం 4.10 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడ బస చేస్తారు. శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సత్తా చాటిన అహానా, భవేష్

విశాఖ స్పోర్ట్స్: జోనల్ స్థాయి సీబీఎస్‌సీ క్లస్టర్ 7 మీట్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో అహానా, భవేష్ సత్తా చాటారు. షూటింగ్ పోటీల్లో అహానా రాణి విజేతగా నిలిచి, జాతీయ స్థాయి సీబీఎస్‌సీ క్లస్టర్ మీట్‌కు అర్హత సాధించింది. నేవీ స్కూల్‌కు చెందిన బాలుర అండర్-19 ఫుట్‌బాల్ జట్టు విజేతగా నిలవగా.. భవేష్ ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచాడు. బాలుర బాస్కెట్‌బాల్ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

వీడెక్కడి వరుడండీ బాబూ!

- కుంటి సాకులతో పెళ్లికి నిరాకరణ
- వివాహం రద్దు చేసుకున్న వధువు బంధువులు

గోపాలపట్నం: అంతటా సందడి వాతావరణం.. కొత్త జీవితంలో అడుగు పెడుతున్న ఆ జంటను చూసి ఇరు కుటుంబాల సంతోషానికి అవధుల్లేవు. పాస్టర్లు ప్రార్థనలు చేసి, క్రీస్తు దీవెనలు అందజేశారు. నూతన జంట కలకాలం చల్లగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఉంగరాలు మార్చుకునే క్షణం రానే వచ్చింది. ఇంతలో బిగ్ ట్విస్ట్. పెళ్లి కొడుకు బాత్రూమ్‌కు అని చెప్పి వెళ్లాడు. అక్కడి నుంచి ఎంతకీ రాకపోవడంతో బంధువులు ఆందోళనకు గురయ్యారు. బాత్రూమ్ వద్దకు వెళ్లి తలుపులు ఎంత కొట్టినా అతను తెరవలేదు. చివరకు బతిమలాడటంతో బయటకు వచ్చి పెళ్లి ఇష్టం లేదని బాంబు పేల్చాడు. ఏవో కుంటిసాకులు చెప్పుకొచ్చాడు. దీంతో బంధువులు, పెళ్లి పెద్దలు ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా కొడతారేమోనన్న భయంతో వరుడు డయల్ 100కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్టేషన్‌కు పెళ్లి కొడుకు, పెళ్లి కుమార్తె, వారి బంధువులను పిలిపించారు. వరుడు, వధులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లికి ఒప్పించే ప్రయత్నం చేశారు. అర్థం పర్థం లేని వరుడి తీరును చూసి వధువు, ఆమె బంధువులు వివాహానికి నిరాకరించారు. పెద్దల సమక్షంలో ఇరు వర్గాల మధ్య ఒప్పందం కుదరడంతో ఈ వివాహం రద్దయింది. ఈ ఘటన బుధవారం పాత గోపాలపట్నంలోని ఓ చర్చిలో చోటు చేసుకుంది. నగరానికి చెందిన అమ్మాయికి, పాత గోపాలపట్నంకు చెందిన అబ్బాయికి మూడు నెలల కిందట పెళ్లి సంబంధం కుదిరింది. కట్నంగా రూ.3 లక్షలు, తులమున్నర చైన్, ద్విచక్రవాహనం లాంఛనంగా ఇచ్చేందుకు పెళ్లి కుమార్తె తరపు వారు అంగీకరించారు. బుధవారం వివాహం జరిపించేందుకు నిర్ణయించారు. కొద్ది క్షణాల్లో పెళ్లి తంతు ముగుస్తుందనగా.. వరుడు తీరుతో రద్దయింది. పెళ్లి సంబంధం కుదిర్చిన తర్వాత ఫోన్‌లో అమ్మాయి సరిగ్గా మాట్లాడలేదన్న కారణంతో పెళ్లికి వరుడు నిరాకరించినట్లు తెలిసింది.

నీతి ఆయోగ్ ఏబీ ఫెలోగా ఏయూ పరిశోధకురాలు

ఏయూక్యాంపస్: భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ యాస్పిరేషనల్ బ్లాక్ ఫెలోగా ఏయూ బయోకెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలు బాతా హెప్సిబా వినీల ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమెకు బుధవారం అధికారిక ఉత్తర్వులు అందాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలానికి యాస్పిరేషనల్ బ్లాక్స్ ఫెలో(ఏబీఎఫ్)గా వినీల సేవలందిస్తారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏబీఎఫ్‌గా ఎంపికైన వారికి నెలకు రూ.55 వేలు స్టైపెండ్ అందిస్తారు. వారు తమకు కేటాయించిన మండలం సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తారు. స్థానిక ప్రజలకు వర్క్‌షాపులు, అవగాహన సదస్సులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నీతి ఆయోగ్ నుంచి అందిస్తుంది. దేశవ్యాప్తంగా మొత్తం 500 యాస్పిరేషనల్ బ్లాకులను ఎంపిక చేయగా.. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 15 బ్లాక్‌లు ఉన్నాయి.



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న హెప్సిబా వినీల

యువకుడి అరెస్ట్

దొండపర్తి: యువతి ఫొటోను మార్ఫింగ్ చేసి వాట్సాప్ ద్వారా బెదిరింపులకు పాల్పడిన యువకుడిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. తనకు డబ్బులు ఇవ్వకపోతే పోర్న్ వెబ్‌సైట్‌లో ఫొటోను అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. దీంతో సదరు యువతి వెంటనే ఫిర్యాదు మేరకు కంచరపాలెం బర్మాక్యాంప్‌కు చెందిన బొడ్డేటి డిల్లేష్(19)ను రిమాండ్‌కు తరలించారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్ రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాల్సిందిగా కోరారు.

28న కొబ్బరి చెక్కల వేలం పాట

తుమ్మపాల: మండలంలోని సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి ఆలయంలో దేవీ నవరాత్రులు పురస్కరించుకుని భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలకు ఈ నెల 28న ఉదయం 11 గంటలకు టెండర్, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాలయం ఈవో కె.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ప్రథమ ధరావతు రూ.5 వేలు చెల్లించి పాల్గొనవచ్చన్నారు. హెచ్చు పాటదారుడు పాట పూర్తయిన వెంటనే మొత్తం నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాటలో పాల్గొనేందుకు హిందువులు మాత్రమే అర్హులని, ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు జిరాక్స్ తీసుకువచ్చి, డిపాజిట్ చెల్లించాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



శాంతిపార్కులో పనులను పరిశీలిస్తున్న జానకీరామరాజు, పబ్లిక్ హెల్త్ అధికారులు

అనకాపల్లిటౌన్: స్థానిక 82వ వార్డు పరిధిలో బుధవారం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, వార్డు ఇన్‌చార్జి మందపాటి జానకీరామరాజు, జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో కలిసి ప్రతిపాదిత పనులను పరిశీలించారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.1.09 కోట్లతో శారదానది వద్ద హిందూ శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన విద్యుత్ దహన వాటికను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేయాల్సిన యంత్రాలపై చర్చించారు. ఎంపీ బీవీ సత్యవతి కేటాయించిన రూ.10 లక్షలతో శాంతిపార్కు, రూ.20 లక్షలతో బీసీ వసతిగృహం, రూ.15 లక్షలతో అభివృద్ధి చేయనున్న ఎస్సీ వసతిగృహాలను పరిశీలించారు. పలు చోట్ల చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ గణపతిరావు, డీఈ మహేష్, ఈఈ బాలు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 2,032 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,550	4,380
రెండో రకం	3,520	4,100
మూడోరకం	3,300	3,510

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 253 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

వైభవంగా.. గంగమ్మ చెంతకు దుర్గమ్మ

శరన్నవరాత్రి మహోత్సవాలు ముగిశాయి. స్థానిక దేవాలయాలు, వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన దుర్గమ్మను రోజుకో అవతారంలో అలంకరించి, అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు కొలిచారు. చాలా మంది భవానీ మాలలు ధరించి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దసరా ఉత్సవాలు ముగియడంతో అంతే భక్తితో, అంతకు మించి వేడుకగా అమ్మవారి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, బాణసంచా మెరుపులు, సంప్రదాయ నృత్యాలతో వైభవంగా జలాశయాల్లో నిమజ్జనం చేశారు.



వేల్పులవీధిలో ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగిస్తున్న భవానీ భక్తులు

- ఘనంగా దుర్గమ్మ విగ్రహాల ఊరేగింపులు
- ఊరూవాడా అంబరాన్నంటిన వేడుకలు
- విజయవాడ బయలుదేరిన భవానీ భక్తులు



దుర్గమ్మ విగ్రహాన్ని శారదానదికి తీసుకెళ్తున్న మహిళా భక్తులు



ఏలేరు కాలువ వద్ద విగ్రహాల నిమజ్జనంలో భవానీ భక్తులు, ప్రజలు



కొప్పాక బాలగణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఊయలలో కనకదుర్గమ్మ



దుర్గమ్మ నిమజ్జన ఊరేగింపులో అమ్మవారి పాదాలకు మొక్కుతున్న భవానీ మాలధారులు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండల పరిధిలో దసరా ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. పలు దేవాలయాలు, మండపాల్లో కనక దుర్గమ్మను తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజించారు. భవానీ భక్తులు నవరాత్రులను పురస్కరించుకుని భవానీ మాలలు ధరించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం కనకదుర్గమ్మను పట్టణ, మండలాల్లో ఆయా కమిటీ సభ్యులు ఊరేగించి, పట్టణంలో శారదానదిలోను, మండలంలోని కొప్పాక ఏలేరు బ్రిడ్జి వద్ద కాలువల్లోను నిమజ్జనం చేశారు. భవానీ మాలధారులు చాలా మంది విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు బయలుదేరారు. శారదానది ఒడ్డు పట్టణ పోలీస్‌లు, జీవీఎంసీ సిబ్బంది, మండలంలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో నిమజ్జన ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కశింకోట: కశింకోటలో బుధవారం దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. విజయ దశమి పురస్కరించుకుని నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలను శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఘనంగా నిమజ్జనం చేశారు. స్థానిక గవరపేట, కళ్లాల దిబ్బ, కనక మహాలక్ష్మి వీధి, దాడి వారి వీధి, పెద్ద బజారు, కస్పావీధి, అమరపిల్లి వీధి, పూసర్లవీధి, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన దుర్గాదేవి విగ్రహాలను గ్రామంలోని వీధుల్లో ఊరేగించారు. ట్రాక్టర్లు, వ్యాన్లు, రిక్షాల్లో ఊరేగించి స్థానిక శారదా నదిలో గవరపేట, కాశీమదుం గ్రోయిన్, శారదా బ్రిడ్జి, ఏలేరు కాలువ ప్రాంతాల్లో నిమజ్జనం చేశారు. గవరపేట ప్రాంతంలో దోనెలపై దుర్గాదేవి విగ్రహాలను ఊరేగించి శారదానది మధ్యలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు ఒడ్డు నుంచి కనులారా తిలకించి భక్తి పారవశ్యం పొందారు. ఉత్సవాల్లో కొందరు మహిళా భక్తులు పూనకాలతో ఊగిపోయారు. మహిళలు ఉత్సాహంగా కోలాటాలు, నృత్యాలు ప్రదర్శించారు. తీన్‌మార్ డప్పులు, వాయిద్యాలు, పెద్ద ఎత్తున బాణసంచాతో సందడి చేశారు. బయ్యవరం, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, జి.భీమవరం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, సోమవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జి. భీమవరం, అచ్చెర్ల, తీడ తదితర గ్రామాల్లో కూడా దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భవానీ మాల ధరించిన భక్తులు విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి రైళ్లు, బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో బయలుదేరారు.

తుమ్మపాల: విజయదశమి నవరాత్రుల ముగింపు సందర్భంగా కనకదుర్గమ్మ మండపాల వద్ద హోమాలు, దీపాలంకరణలు, నిమజ్జన ఊరేగింపులు వైభవంగా జరిగాయి. దుర్గమ్మ మండపాల్లో భవానీ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు యాగాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మహిళలు దీపాలంకరణలు చేసి మండపాల వద్ద భజనలు, చిడతలు వంటి సాంస్కృతిక నృత్యాలతో సందడి చేశారు. పట్టణంలో శారదా కాలనీ కనకదుర్గమ్మ మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి ముగ్గుల పోటీలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి శారదానదిలో నిమజ్జనం చేశారు.

- మండలంలోని రేబాక, కేఎన్నార్ పేట గ్రామాల్లోని పలు మండపాల్లో భవానీ మాలధారులు పూజలు చేశారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం వరకు అమ్మవారిని డప్పులు, డీజే, చిడతలు, కోలాటాలతో ఊరేగించి ఏలేరు కాలువలో నిమజ్జనం చేశారు. అనంతరం విజయవాడ కనకదుర్గమ్మ వద్దకు పయనమయ్యారు.



కశింకోటలో గవరపేట మధ్య వీధి దుర్గాదేవిని రిక్షాపై నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



కశింకోటలో ట్రాక్టర్‌పై కళ్లాల దిబ్బ ప్రాంత దుర్గాదేవి ఊరేగింపు



గవరపేటలో దుర్గాదేవిని శారదానదిలో నిమజ్జనానికి దోనెపై తీసుకెళ్తున్న భక్తులు



నిమజ్జనోత్సవంలో మహిళల కోలాటాలు



దుర్గాదేవి విగ్రహాన్ని తలపై పెట్టుకుని నిమజ్జనానికి తీసుకొస్తున్న కన్నె భవాని

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



కశింకోట పోలీసు స్టేషన్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాస రచన పోటీలు

కశింకోట: 'లైంగిక వేధింపుల నుంచి మహిళలు, పిల్లల రక్షణ–సామాజిక పాత్ర' అనే అంశంపై కశింకోట పోలీసు స్టేషన్‌లో బుధవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ పోలీసు అమర వీరుల ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సమాజం, పోలీసులు, చట్టాల మీద అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

త్వరితగతిన నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు వచ్చే ఏడాది కొత్త అమావాస్య జాతరకు ముందే పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. ఆలయ ఆవరణలో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవదాయ శాఖ ఇంజినీర్ల పర్యవేక్షణలో నిర్మాణ పనుల మార్కింగ్ జరిగిందని, వారం రోజుల్లో పునాది పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవ, టీటీడీ సహకారంలో రూ.13 కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ఎండోమెంట్ డీఈలు కేవీసీ కృష్ణ, జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని కోడూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరగనున్నట్లు ఎంపీడీవో కె.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని, కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం(ఈ చౌడువాడ) సచివాలయం వద్ద గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీడీవో వి.వి.రవికుమార్‌లు బుధవారం తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక పీహెచ్‌సీల వైద్యులు రోగుల్ని పరీక్షించి, అవసరమైన వైద్య పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలోని కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

కామాక్షిదేవి సన్నిధిలో ఎంపీ దంపతులు



అమ్మవారి సన్నిధిలో ఎంపీ సత్యవతి దంపతులు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: గవరపాలెం నిదానందొడ్డి కామాక్షి దేవిని ఎంపీ బీవీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దీపావళి, కార్తీకమాసం పూజలకు ఆలయ ఆవరణలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు.

- కామాక్షి అమ్మవారిని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని, పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కోటిపల్లి శ్రీదేవి, ఆలయ చైర్మన్ కె.శ్రీను, వైస్ చైర్మన్ శొంఠ్యాన సతీష్, కోశాధికారి తణుకు రవికుమార్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తుమ్మపాల కార్మికుల బకాయిలు చెల్లించాలని వినతి

అనకాపల్లిటౌన్: మండలంలోని తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ది అనకాపల్లి వీవీ రమణ సుగర్ ఫ్యాక్టరీ మాజీ ప్రధాన కార్యదర్శి బుద్ద రామశంకరరావు, మాజీకోశాధికారి యల్లపు రాములు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ట్రెజరీలో పెండింగ్‌లో ఉన్న తుమ్మపాల కార్మికుల బకాయి నిధులు రూ.5.10 కోట్లను తక్షణమే చెల్లించేలా జిల్లా మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్‌లు చొరవ తీసుకోవాలని కోరారు.

పేదలకు ధైర్యం.. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యం



కూండ్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఓపీ కోసం నిరీక్షిస్తున్న ప్రజలు



కూండ్రం శిబిరాన్ని తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి దేవి



వైద్య శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి



అమీన్‌సాహెబ్‌పేట శిబిరానికి సహాయకులతో కలిసి వాకర్ సాయంతో వస్తున్న రోగి



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు

అనకాపల్లిటౌన్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని జీవీఎంసీ జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ, వైఎస్సార్ సీపీ 81వ వార్డు ఇన్‌చార్జి పీలా రాంబాబులు తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో సచివాలయం–15 పరిధి(దేమునిగుమ్మం) ప్రజల కోసం బుధవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ కార్యక్రమంతో చిన్నచిన్న వ్యాధులతో బాధపడే ప్రజలకు స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందుతోందన్నారు. అవసరమైన మందులు ఉచితంగానే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక, సీరియస్ వ్యాధులతో బాధపడే రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందించనున్నట్లు వెల్లడించారు. కంటి సమస్యలతతో ఇబ్బందిపడే వారికి కంటి పరీక్షలు జరిపి, కళ్లద్దాలు, శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో సుమారు 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించగా, ముగ్గురిని మరింత మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, సచివాలయం ఉద్యోగులు, ఆశావర్కర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం –కూండ్రం శిబిరంలో ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి రూరల్: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. బుధవారం మండలంలోని కూండ్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు గ్రామ స్థాయిలోనే అందించడం అభినందనీయమన్నారు. వివిధ దశల్లో స్పెషలిస్టు వైద్యులు, వైద్య సిబ్బంది చేస్తున్న స్క్రీనింగ్, వైద్య పరీక్షలు, ఇతర సేవలను పర్యవేక్షించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్ళి ప్రజలు రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన అగత్యం రాకూడదనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. వచ్చే నెల 15 వరకూ శిబిరాలు ఉంటాయన్నారు. వీటిని ప్రజలంతా ఉపయోగించుకుని తగిన వైద్యం పొందాలన్నారు. పలువురికి ఉచిత మందుల కిట్లను ఎంపీపీ అందజేశారు.

402 మందికి ఓపీ సేవలు

కూండ్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 402 మందికి ఓపీ సేవలు అందించినట్లు వైద్యాధికారిణి ఎస్.వాణీ జగదీశ్వరి తెలిపారు. వీరిలో 21 మందికి మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు, జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేశారు. 220 మందికి ర్యాండమ్ బ్లడ్ సుగర్, 172 మందికి బీపీ, 9 మందికి మలేరియా, ఒకరికి డెంగ్యూ, ఐదుగురికి ఈసీజీ పరీక్షలు చేశారు. 10 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. స్పెషలిస్టు వైద్యులు టి.ప్రతిభ, బి.ఇందుభార్గవి, సివిల్ అసిస్టెంట్ సర్జన్ జి.రమ, కూండ్రం సర్పంచ్ నందారపు లక్ష్మి, నందారపు సూరిబాబు, ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈవోపీఆర్డీ కె.ధర్మారావు, ఎంఈవో చిట్టిబాబు, సేనాపతి అప్పలనాయుడు, యాదగిరి తాతనాయుడు, బొబ్బర శ్రీను పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట సచివాలయంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇప్పటి వరకు మండలంలో 16 సచివాలయాల పరిధిలో నిర్వహించిన 16 శిబిరాల్లో కంటే ఇక్కడే అత్యధిక మంది వైద్య సేవలు పొందడం విశేషం. స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో 581 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారు. 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 23 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు, 96 మందికి కళ్లద్దాలు ఇచ్చేందుకు సిఫార్స్ చేశారు. 43 మందికి ఉన్నత వైద్యం అవసరమని గుర్తించి జిల్లా ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ప్రత్యేక వైద్యులు గ్రేసీ కేథరిన్, అనిల్, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు మనీషా, ఎస్.తిరుపతిరావు రోగులను పరీక్షించి అవసరమైన మందులు ఉచితంగా అందించారు. కంటి రోగులను ఆప్తాలమిక్ అధికారి పవన్ కల్యాణ్ పరీక్షించారు. శిబిరాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు ప్రారంభించారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, సర్పంచ్ మలసాల ధనమ్మ శిబిరాన్ని ఆద్యంతం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యాన్ని అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కలిగిస్తూ ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది. స్కూల్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం జగనన్న గోరుముద్దలో ఆరు రోజుల పాటు అందిస్తున్న మెనూ ప్రకారం ఆహార పదార్థాలను వండి ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లను సందర్శనార్థం ఉంచారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మధు, అద్దెపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యారావు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామ వలంటీర్లు, ఆశ కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు శిబిరంలో సేవలందించారు.



వైద్య శిబిరంలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎంపీపీ సూరిబాబు



అమీన్‌సాహెబ్‌పేట శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు



శిబిరంలో చంటిపాపకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన